

బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్న సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ దంపతులు

ఎల్లమ్మను దర్శించుకున్న కార్పొరేటర్ దంపతులు

అమీర్‌పేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మంగళవారం సందర్భంగా బల్కంపేట ఎల్లమ్మను బీఆర్ఎస్ పార్టీ సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయం ప్రధాన అర్చకులు అనిల్ కుమార్ తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ తమ ఇంటి ఇలవేల్పు బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ తల్లి అని, ప్రతీ సంవత్సరం శ్రావణమాసంలో కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటామని తెలిపారు. వీరి వెంట బీఆర్ఎస్ అమీర్‌పేట డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, వనం శ్రీనివాస్, ఎర్రోళ్ల నరేష్ తదితరులు ఉన్నారు.



గాజులతో ప్రత్యేక అలంకరణలో బల్కంపేట ఎల్లమ్మ

ఎల్లమ్మకు గాజులతో అలంకారం

అమీర్‌పేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మంగళవారం పురస్కరించుకుని బల్కంపేట ఎల్లమ్మ మూల విరాట్‌లను గాజులతో సుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు.

బైపీసీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

బోరబండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బోరబండలోని బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ గ్రూపులో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ గోపిశెట్టి రమణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతిలో 450 అంతకన్నా ఎక్కువ మార్కులు వచ్చిన వారికి అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు 7వ తేదీ ఉదయం 11 గంటల వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాల కోసం 7330908473లో సంప్రదించాలని ఆమె సూచించారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

బోరబండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడిని బోరబండ పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డ్రైవర్‌గా పనిచేసే బస్వరాజ్ రాథోడ్‌ను అతడి సోదరుడు ప్రేమ్‌రాజ్ రాథోడ్ సోమవారం తెల్లవారుజామున బండరాయితో మోది హత్య చేశాడు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

43 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

- ఆటోడ్రైవర్‌కు 18 రోజులు జైలు శిక్ష

ఖైరతాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మందుబాబులపై సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. 43 మందిపై కేసులు నమోదు చేసి నాంపల్లి 10వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరుపరిచారు. ఇందులో మొదటిసారి పట్టుబడ్డ 40 మందికి న్యాయమూర్తి రూ.3100 జరిమానా విధించారు. ఇప్పటికే రెండుసార్లు జైలు శిక్ష అనుభవించినా, తీరు మార్చుకోని ఓ ఆటోడ్రైవర్‌కు 12 రోజుల జైలు శిక్షతో పాటు రూ.7,300 జరిమానా విధించగా, ఆయన జరిమానా చెల్లించకపోవడంతో మరో 6 రోజులు శిక్ష విధించారు. అలాగే, రెండోసారి పట్టుబడ్డ ఓ వ్యక్తికి 6 రోజుల జైలు శిక్షతో పాటు రూ.4,300 జరిమానా విధించగా, జరిమానా చెల్లించకపోవడంతో మరో నాలుగు రోజులు జైలు శిక్ష విధించారు. మరో కేసులో బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో 316 ఎంజీ మేర చూపించిన ఓ యువకుడికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.3,100 జరిమానా విధించారు.

పేకాట ఆడుతున్న ఏడుగురి అరెస్ట్

యూసుఫ్‌గూడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మిద్దెపై పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను మధురానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్ నగర్‌లోని మిద్దెపై ఏడుగురు వ్యక్తులు జూదం ఆడుతున్నారని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం పోలీసులు దాడి చేసి జూదం ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేశారు. ఏడు సెల్‌ఫోన్‌లు, రూ.17,900 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఆఫీసుకు వెళ్లిన యువతి అదృశ్యం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి ఆఫీసుకు వెళ్లిన యువతి అదృశ్యమైంది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేటకు చెందిన ప్రవళిక(26) అమెరికాకు చెందిన ట్యాటూ కంపెనీ ఉద్యోగి. సోమవారం అమీర్‌పేట మైత్రివనం మెట్రో పిల్లర్ నెంబర్.1047 వద్ద ఉన్న కార్యాలయానికి ఈనెల 4న వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్లకపోవడంతో ఆమె సోదరుడు బి.కార్తికేష్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

చేజారిన ఎంటెక్ చాన్స్!

నేటి నుంచి పీజీఈసెట్ ప్రవేశాలకు ధ్రువపత్రాల పరిశీలన

- ర్యాంకులు పొందిన అభ్యర్థులకు బీటెక్ సర్టిఫికెట్లు ఇవ్వని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదవాలనుకుంటున్న విద్యార్థుల ఆశలపై ప్రైవేట్ కాలేజీలు నీళ్లు చల్లుతున్నాయా అంటే.. అవుననే అంటున్నారు తల్లిదండ్రులు. ఒకవైపు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడం, మరోవైపు బీటెక్ పూర్తయి రెండేళ్లయినా విద్యార్థులకు ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ధ్రువపత్రాలు ఇవ్వకపోవడంతో వేలాదిమంది విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు చేజారిపోతున్నాయి. పోస్ట్‌గ్రాడ్యుయేటెడ్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం పీజీఈసెట్ ర్యాంకులు పొందిన అభ్యర్థులకు బుధవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం కానుండగా, ప్రైవేట్ కాలేజీల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు యాజమాన్యాలు ససేమిరా అంటున్నాయి. ప్రైవేట్ కాలేజీల మొండివైఖరితో ఉన్నత చదువులు చదవాలనుకుంటున్న తమ బిడ్డల ఆశలు అడియాశలే అవుతున్నాయని బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. తాజాగా కొందరు విద్యార్థులు, తల్లిదండ్రులు జేఎన్‌టీయూ అధికారులకు, సాంకేతిక విద్యా కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, కొన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. కమిషనర్ ఆదేశాలను సైతం కళాశాలల యాజమాన్యాలు ఖాతరు చేయడం లేదని, సర్టిఫికెట్లు ఇవ్వకుండా మొండిగా వ్యవహరిస్తున్నాయని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా కళాశాలలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, తక్షణం సర్టిఫికెట్లు ఇప్పించేలా ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రెండేళ్లుగా తీరని ఆకాంక్ష..

ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థిని కీర్తి నగర శివారులోని సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో గతేడాది బీటెక్ పూర్తి చేసింది. షెడ్యూల్ కులాలకు చెందిన తనకు నాలుగేళ్ల పాటు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరైనప్పటికీ, రెండేళ్లుగా కాలేజీ యాజమాన్యం తన ఒరిజినల్ సర్టిఫికెట్లను జారీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది. రెండేళ్లుగా పీజీఈసెట్ రాసి మంచి ర్యాంక్ తెచ్చుకున్నా, కళాశాల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వని కారణంగా తమ బిడ్డ ఎంటెక్ అవకాశాలను కోల్పోతున్నదని తండ్రి వెంకటేశ్వర్లు ఆరోపించారు.

ఈ ఏడాదైనా తన బిడ్డ ఎంటెక్ చదివేందుకు అవసరమైన సర్టిఫికెట్లను సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ నుంచి ఇప్పించాలని సాంకేతిక విద్యా కమిషనర్‌కు వినతిపత్రం పంపారు. స్పందించిన ఉన్నతాధికారి బాధిత విద్యార్థి సర్టిఫికెట్లను వెంటనే జారీ చేయాలని సదరు కాలేజీ ప్రిన్సిపాల్‌కు సోమవారం నోటీసులు పంపారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను కలవగా సర్టిఫికెట్లు ఇచ్చేందుకు నిరాకరించారు. సాంకేతిక విద్యా కమిషనర్ నుంచి వచ్చిన ఆదేశాల విషయమై సీవీఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డిని ఫోన్ ద్వారా 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.




వీధి కుక్కల స్వైర విహారం

- భయపడుతున్న మహిళలు, పిల్లలు
- అధికారులు చర్యలు తీసుకోవాలి

బౌద్ధనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కుక్కలు ద్విచక్ర వాహనాదారులను వెంబడించడంతో వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల గ్రేటర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పిల్లలు, పెద్దలపై వీధికుక్కలు దాడిచేసిన సందర్భాలు, చాలా ఉన్నాయి. సీతాఫల్‌మండిలోని చిలకలగూడ, మైలార్‌గడ్డ, నామాలగుండు, టీఆర్‌టీ కాలనీ, బీదలబస్తీ, ఇందిరానగర్‌కాలనీ, బౌద్ధనగర్ డివిజన్‌లోని వారాసిగూడ చౌరస్తా, పోచమ్మ ఆలయం వీధి, మహ్మద్‌గూడ, బౌద్ధనగర్, లలితనగర్‌కాలనీ, బ్యాంక్‌కాలనీ, జామైఉస్మానియా, పార్సీగుట్ట తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు ఎక్కువగా సంచరిస్తున్నాయి. బౌద్ధనగర్ వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో అధికసంఖ్యలో వీధి కుక్కలు సంచరిస్తున్నాయి. దీంతో ఇంటి నుంచి బయటకు రావాలంటే భయమేస్తుందని, రాత్రిళ్లు మొరుగుతూ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. జీహెచ్ఎంసీ డ్యాగ్ స్క్వాడ్ అప్పుడప్పుడు ఆయా ప్రాంతాల్లో కుక్కలను పట్టుకుని తీసుకువెళ్లి ఇంజెక్షన్లు చేసి మరలా అదే ప్రాంతంలో వదిలి వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నుంచి కాపాడాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

వీధుల్లోకి వెళ్లలేని పరిస్థితి

సీతాఫల్‌మండి, బ్రాహ్మణబస్తీ, ఇందిరానగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద విపరీతంగా ఉంది. ఇవి గుంపులుగా తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రాత్రిళ్లు ఈ మార్గంలో వెళ్లలేని పరిస్థితి. ద్విచక్ర వాహనదారుల వెంటపడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.



- జంగిటి దేవేందర్, మైలార్‌గడ్డ



వారాసిగూడలో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

నిద్ర లేకుండా పోతుంది



వారాసిగూడ ప్రధాన రహదారిపై, పోచమ్మ ఆలయం వీధిలో, జామై ఉస్మానియా వద్ద వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కలు స్కూలుకు వెళ్లే విద్యార్థులు, పాదాచారుల వెంట పడుతున్నాయి. వీటి అరుపులతో రాత్రుళ్లు నిద్రలేకుండా పోతుంది. వీధి కుక్కలను చూస్తుంటే పిల్లలు, పెద్దలు బెంబేలెత్తిపోతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

- సంపత్, నామాలగుండు

సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు

బోరబండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని రహ్మత్ నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి అన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో వర్షాకాలంలో మురుగునీటి సమస్యలు, దోమలవ్యాప్తి, చెత్త పేరుకుపోవడం వంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక శుభ్రత కార్యక్రమాన్ని రహ్మత్ నగర్ డివిజన్ పరిధిలో మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ ద్వారా ప్రతీ గల్లీ, వీధి, కాల్వలను పూర్తిస్థాయిలో శుభ్రం చేస్తారని తెలిపారు. సకాలంలో చెత్త తొలగింపు, ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రేలు, నీటి నిల్వలను తొలగించడం వంటి చర్యలు చేపడతారని వెల్లడించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్-19 డీపీఓ వెంకటకిషన్‌రావు, ఎంటమాలజీ ఏఈ సావిత్రి, ఇన్‌చార్జి ఏఎంఓహెచ్ గోపాలకృష్ణ, ఆర్పీలు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక శుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి

'మత స్వేచ్ఛ స్వప్నమా...సత్యమా'పై జాతీయ సదస్సు

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మతమార్పిడి చేస్తున్నారన్న ఆరోపణలతో క్రైస్తవులపై దాడులు చేస్తున్నారని సివిల్ రైట్స్ ఇనిషియేటివ్ ఇంటర్నేషనల్ జాతీయ అధ్యక్షుడు, మాజీ అదనపు డీజీపీ(మధ్యప్రదేశ్) బాబురావు ఆవేదన వ్యక్తం చేశారు. 9వ తేదీన సికింద్రాబాద్, క్లాక్‌టవర్ వద్ద గల సెంటినరీ బాప్టిస్టు చర్చిలో నిర్వహించే భారతదేశంలో 'మత స్వేచ్ఛ స్వప్నమా..సత్యమా..'అనే అంశంపై నిర్వహించే జాతీయ సదస్సు వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా క్రైస్తవులపై జరుగుతున్న అణచివేత, హింసాత్మక దాడులు, మత స్వేచ్ఛపై పెరుగుతున్న ఆంక్షల నేపథ్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పన్నెండు రాష్ట్రాల్లో మత నిరోధక బిల్లు తెచ్చి వేధిస్తున్నారని మండిపడ్డారు. దళిత క్రైస్తవులను క్రిస్టియన్‌లోకి మారకుండా, మారిన వారిని తిరిగి వచ్చేలా ఘర్‌వాపసీ వంటి ఉద్యమాల ద్వారా బలవంతపు మతమార్పిళ్లు జరుగుతున్నాయని అన్నారు. ఈ సదస్సుకు రాజ్యాంగ విలువలను నమ్మే ప్రతీ పౌరుడు హాజరు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జాతీయసదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఆర్ఐఐ జాయింట్ సెక్రటరీ సురేష్, విద్యాసవంతి, ఫిరోజ్‌షా, అరుణ్‌జ్యోతి, లియో, సంజీవ్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సివిల్ రైట్స్ ఇనిషియేటివ్ ఇంటర్నేషనల్ సభ్యులు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సైన్స్ అధికారి ధర్మేంద్రరావు అన్నారు. తిరుమలగిరిలోని హోలీ ఫ్యామిలీ హైస్కూల్‌లో తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సీనియర్ సోషల్ సైంటిస్ట్ డాక్టర్ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో నేషనల్ స్టూడెంట్ పర్యావరణ కాంపిటీషన్(ఎన్ఎస్‌పీసీ- 2025) పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ధర్మేంద్రరావు మాట్లాడుతూ.. కాలుష్యాన్ని నివారించి, పాఠశాలల్లో పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓలు బాలునాయక్, శ్రవణ్‌కుమార్, డీఐఓఎస్ వీరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఫిఫా అకాడమీకి రుద్రాక్ష

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఒడిశాలోని ప్రతిష్ఠాత్మక ఫిఫా ఫుట్‌బాల్ అకాడమీకి హైదరాబాద్ సాకర్ క్రీడాకారుడు రుద్రాక్ష్ ఎంపికయ్యాడు. వివిధ దశల్లో దేశవ్యాప్తంగా నిర్వహించిన ట్రయల్స్‌లో మొత్తం 19 మందిని ఎంపిక చేయగా అందులో తెలంగాణ నుంచి రుద్రాక్ష్‌కు చోటు లభించడం విశేషం.



రుద్రాక్ష్



జై భారత్ సామాజిక విప్లవ రణభేరి సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఖదిజ్ఞాసి ముప్పారం ప్రకాశం, జీవన్ జోయల్, రజిత, తదితరులు

17న జై భారత్ సామాజిక విప్లవ రణభేరి సభ

పంజాగుట్ట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న 'చలో జోగిపేట' పేరుతో చేపట్టిన జై భారత్ సామాజిక విప్లవ రణభేరి పోస్టర్, కరపత్రాలను ఆ సంస్థ రాష్ట్ర రీ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ ఖదిజ్ఞాసి డాక్టర్ ముప్పారం ప్రకాశం మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనువాదానికి, మత విద్వేషానికి వ్యతిరేకంగా జై భారత్ సామాజిక విప్లవ రణభేరి పనిచేస్తోందన్నారు. నేడు దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కులోన్మాదం, మతోన్మాదం అని, ఈ సమస్యలపై జై భారత్ పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కో-కన్వీనర్ జీవన్ జోయల్, జాతీయ కార్యదర్శులు ఖదిజ్ఞాసి రజని, లోక్‌నాథ్, జాతీయ ఉపాధ్యక్షుడు ఖదిజ్ఞాసి వంశీ, రాష్ట్ర అధ్యక్షుడు కోల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి రాజు, వివిధ సంఘాల నాయకులు గణేశ్ గల్లా, లావణ్య సుధీర్, ప్రభాకర్‌గౌడ్, అందోల్ మల్లేశం, శేఖర్, పి.నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

బహుజనులంతా ఏకం కావాలి

తార్నాక, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అంబేడ్కర్ రాజ్య స్థాపన కోసం బహుజనులంతా ఏకం కావాలని ప్రొ.గాలి వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం తార్నాకలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(భీంరావ్ అంబేడ్కర్) పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా తాను 17న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో యూత్ వింగ్ అధ్యక్షుడు అక్బర్ అలీ, విద్యార్థి నాయకుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.



నగరంలోని సచివాలయం వద్ద తెలుగు తల్లి ఫ్లైఓవర్ కింద జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. ఇందులో చిన్నారులు ఈత కొడుతూ సరదాగా గడుపుతున్నారు.

ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

● సరదా.. సరదాగా..




క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు, క్రీడలకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటాయని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అమీర్‌పేట్‌లోని బల్కంపేటలో గల శ్రీవీర హనుమాన్ వ్యాయామశాలలో శిక్షణ పొందిన అనిష్(గోల్డ్), సోను (సిల్వర్), సందీప్ యాదవ్ (బ్రాన్స్)లు రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ చాటి మెడల్స్ సాధించారు. మంగళవారం వారు వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలువగా వారిని ఆయన అభినందించారు. జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీల్లో రాణించి హైదరాబాద్ సత్తా చాటాలని ఆయన కోరారు. శ్రీవీర హనుమాన్ వ్యాయామశాలకు దాతలు సహకారంతో రూ.10 లక్షల విలువైన పలు రకాల పరికరాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేష కుమారి, నాయకులు హన్మంతరావు, అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ, కట్ట బలరాం, వనం శ్రీనివాస్, వ్యాయమశాల ప్రతినిధి రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.



వీధి కుక్కల స్వైర విహారం

● భయపడుతున్న మహిళలు, పిల్లలు

● అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికుల వినతి

బౌద్ధనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కుక్కలు ద్విచక్ర వాహనాదారులను వెంబడించటంతో వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పిల్లలు, పెద్దలపై వీధికుక్కలు దాడిచేసిన సందర్భాలు, చాలా ఉన్నాయి. సీతాఫల్‌మండిలో చిలకలగూడ, మైలార్‌గడ్డ, నామాలగుండు, టీఆర్‌టీ కాలనీ, బీదలబస్తీ, ఇందిరానగర్‌కాలనీ, బౌద్ధనగర్ డివిజన్‌లోని వారాసిగూడ చౌరస్తా, పోచమ్మ ఆలయం వీధి, మహ్మద్‌గూడ, బౌద్ధనగర్, లలితనగర్‌కాలనీ, బ్యాంక్‌కాలనీ, జామైఉస్మానియా, పార్శీగుట్ట తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు ఎక్కువగా సంచరిస్తున్నాయి. బౌద్ధనగర్ వారాసిగూడ పోలీస్‌స్టేషన్ మార్గంలో అధికసంఖ్యలో వీధి కుక్కలు సంచరిస్తున్నాయి. దీంతో బయటకు రావాలంటే భయమేస్తుందని, రాత్రిళ్లు మొరుగుతూ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. జీహెచ్‌ఎంసీ డ్వాగ్ స్క్వాడ్ అప్పుడప్పుడు ఆయా ప్రాంతాల్లో కుక్కలను పట్టుకుని తీసుకువెళ్లి ఇంజెక్షన్లు చేసి మరలా అదే ప్రాంతంలో వదిలి వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నుంచి కాపాడాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

వీధుల్లో వెళ్లలేని పరిస్థితి

సీతాఫల్ మండి, బ్రాహ్మణబస్తీ, ఇందిరానగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద విపరీతంగా ఉంది. ఇవి గుంపులుగా తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రాత్రిళ్లు ఈ మార్గంలో వెళ్లలేని పరిస్థితి. ద్విచక్ర వాహనదారుల వెంటపడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. **- జంగిటి దేవేందర్, మైలార్‌గడ్డ**




వారాసిగూడలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

నిద్ర లేకుండా పోతుంది



వారాసిగూడ ప్రధాన రహదారిపై, పోచమ్మ ఆలయం వీధిలో, జామై ఉస్మానియా వద్ద వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కలు స్కూలు వెళ్లే విద్యార్థులు, పాదచారుల వెంట పడుతున్నాయి. వీటి అరుపులతో రాత్రుళ్లు నిద్రలేకుండా పోతుంది. వీధి కుక్కలను చూస్తుంటే పిల్లలు, పెద్దలు బెంబేలెత్తిపోతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. **- సంపత్, నామాలగుండు**


మోండా డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్, అధికారుల బృందం

వసతుల కల్పనకు చర్యలు

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మోండా డివిజన్‌లో సమస్యల గుర్తింపుతో పాటు మెరుగైన వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై జీహెచ్‌ఎంసీ అధికారుల బృందం, కార్పొరేటర్ పర్యటించారు. మంగళవారం మోండా, పాట్ మార్కెట్, బండిమెట్, మారుతివీధి, సికింద్రాబాద్ స్టేషన్ ప్రాంతాల్లో పరిశీలించారు. రోడ్ల మరమ్మతులు, నాలాలో డీసిల్టింగ్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్, వీధిలైట్లు, చెట్టు కొమ్మలు తొలగించడం తదితర సమస్యలను కార్పొరేటర్ కొంతం దీపిక అధికారుల బృందానికి వివరించారు. జీహెచ్‌ఎంసీ జాయింట్ కమిషనర్ మోహన్‌రెడ్డి, నార్త్ జోన్ డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్, శానిటేషన్ డీఈ వెంకటేష్, ఎంటమాలజీ ఏఈ శ్రీనివాస్ రెడ్డి, ఇంజనీరింగ్ డీఈ ఆంజనేయులు, హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ అనిల్, వెటర్నరీ విభాగం డాక్టర్ జమీల్, యూసీడీ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


వాయిద్య పరికరాలు అందజేస్తున్న ఎనేబ్‌లింగ్ లీడర్‌షిప్ క్రియేట్ సంస్థ ప్రతినిధులు

వాయిద్య పరికరాల అందజేత

చిలకలగూడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్, చిలకలగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో బుధవారం ఎనేబ్‌లింగ్ లీడర్‌షిప్ క్రియేట్ సంస్థ విద్యార్థులకు సంగీత వాయిద్య పరికరాలు అందజేసింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మారేడుపల్లి మండల ఉపపర్యవేక్షణాధికారి మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సంగీతంపై ఆసక్తి పెంపొందించుకోవాలని తెలిపారు. ఎనేబ్‌లింగ్ లీడర్‌షిప్ క్రియేట్ సంస్థ ప్రతినిధి పృధ్వీలాల్ మాట్లాడుతూ ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో సంగీతంతోపాటు ఫుట్‌బాల్‌లో శిక్షణ ఇచ్చి, పోటీలు నిర్వహించి వారిలోని ప్రతిభ వెలికి తీయటానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఆపరేషన్ మేనేజర్ పాల్ ప్రదీప్, సంగీత టీచర్ ధనుష్ రామ్, పాఠశాల టీచర్లు మల్లీశ్వరి, హసీనా బేగం, సుల్తానా, తదితరులు పాల్గొన్నారు.


వైద్యశిబిరంలో పాల్గొన్న దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన

డీబీఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

చిలకలగూడ/బౌద్ధనగర్ ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో మంగళవారం మెట్టుగూడ డివిజన్ హమాల్‌బస్తీలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులికల్పన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, మహిళలు కుటుంబం పనిలో పడి ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయవద్దని సూచించారు. గుండె, లీవర్, కిడ్నీ, రక్తపోటు, మధుమేహం వంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్ నిఖిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో డీబీఎఫ్ మండల కార్యదర్శి శశికళ, సభ్యులు మాసమ్మ, రమ్య, సుజాత, పరమేశ్వరి, కవిత, మానస, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

● సీతాఫల్‌మండి, శ్రీదేవి నర్సింగ్ హోమ్ ఎదురుగా బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సద్వినియోగం చేసుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులికల్పన తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్ కుమార్ తదితరులు

బహుజనులంతా ఏకం కావాలి

● ప్రొ. గాలి వినోద్ కుమార్

తార్నాక, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో అంబేడ్కర్ రాజ్య స్థాపనకై బహుజనులంతా ఏకం కావాలని ప్రొ.గాలి వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం తార్నాకలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(భీంరావ్ అంబేడ్కర్) పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా తాను 17న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆ పార్టీ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఇన్‌చార్జి డాక్టర్ మేజర్ చంద్రకాంత్, తెలంగాణ ముస్లిం వింగ్ అధ్యక్షుడు సయ్యద్ ఎజాజ్, జనరల్ సెక్రటరీ వికార్ అలీతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌పీఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ భీమ్‌రావ్ యశ్వంత్ అంబేడ్కర్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోబ్రే ముఖ్య అతిథులుగా హాజరవుతారని, అంబేడ్కర్ వారసులందరూ వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ వింగ్ అధ్యక్షుడు అక్బర్ అలీ, విద్యార్థి నాయకుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీల్లో తీరనున్న విద్యుత్ వెతలు

● సీఎండీ నేతృత్వంలో అధికారుల పర్యటన


ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తున్న సిబ్బంది


విద్యుత్ సమస్యలపై క్షేత్రస్థాయిలో చర్చిస్తున్న ముషారఫ్ అలీ ఫరూఖీ

సికింద్రాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లోని రసూల్‌పురా, ఇందిరమ్మనగర్, రాణిబాగ్, బాలంరాయి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ వెతలు తీరనున్నాయి. వర్షాకాలంలో విద్యుత్ ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియక నానా అవస్థలు పడుతున్న పలు కాలనీలు/బస్తీల ప్రజలకు ఉపశమనం కలగనుంది. ఈ కాలనీలు, బస్తీల్లో తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతోందంటూ ఫిర్యాదులు వస్తుండడంతో టీజీఎస్‌పీడీసీఎల్‌సీ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ నేతృత్వంలో అధికారుల బృందం మంగళవారం జింఖాన సబ్ స్టేషన్ పరిధిలోని అయా ప్రాంతాల్లో పర్యటించింది. విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కావడానికి, అంతరాయం ఏర్పడడానికి గల కారణాలను అధ్యయనం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లు, ఎల్‌టీ లైన్స్, విద్యుత్ స్తంభాలను తనిఖీ చేశారు. ఏమాత్రం జాప్యం చేయకుండా ఆయా సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని అలీ ఫరూఖీ ఆదేశాలు జారీ చేశారు. దాంతో యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనుల ప్రారంభించడం విశేషం. టీజీఎస్‌పీడీసీఎల్‌సీ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎం.నరసింహులు, మెట్రో జోన్ చీఫ్ ఇంజనీర్ వి.ప్రభాకర్, సికింద్రాబాద్ ఎస్ఈ ఎల్.గోపయ్య, మారేడుపల్లి డీఈ సుబ్బారెడ్డి, లాల్‌బజార్ ఏడీఈ విజయకుమార్, జింఖాన ఏడీఈ రామాచారి, ఏఈఎస్ అర్పితరెడ్డి, కార్ఖాన ఏఈ మాధవి తదితరులు సీఎండీతో పాటు పర్యటించిన వారిలో ఉన్నారు.

గిరిజన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు

బోయినపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : గిరిజన బాల బాలికల్లో శారీరక, మానసిక, సామాజిక అవగాహనను పెంపొందిస్తూ సమానతా దృక్పథాన్ని కలిగించడానికి హర్ వాయిస్ వాయిస్ ఫర్ బాయ్స్ పేరిట గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణా శిబిరాలు మంగళవారం బోయినపల్లి బాపూజీనగర్‌లోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ హైస్కూల్‌లో ప్రారంభమయ్యాయి. ఈ శిబిరాల్లో వాయిస్ ఫోర్ సంస్థ, ఐటీడీఏ సంస్థల సహకారంతో ఉచిత శిక్షణలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.సర్వేశ్వరరెడ్డి, హైదరాబాద్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఆర్. కోటజీ శిక్షణా శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కోటజీ మాట్లాడుతూ పదిరోజుల పాటు, ఈ ప్రత్యేక శిక్షణా శిబిరాలు జరుగుతాయని అన్నారు. బాలికల కోసం ప్యూబర్టీ హక్కులపై అవగాహన, లైంగిక హింస నివారణ అంశాలపైన, బాలురలకు లింగ సమానత్వం గౌరవం, మహిళల పట్ల సానుభూతి, ఆత్మ నియంత్రణ, నాయకత్వ లక్షణాలపైన అవగాహన కల్పిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ సునిత, ప్రధానోపాధ్యాయులు బాణోతు లాలు, ఆముక్త మాల్యద, వార్డెన్లు నీలిమ, రెబెకా, ఎల్లమ్మ, పాఠశాల సిబ్బంది, కార్యక్రమ సమన్వయకర్త, కో-ఆర్డినేటర్ భాను, సమీర్ తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, పాల్గొన్న విద్యార్థులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం

మత్తు పదార్థాల వినియోగ నివారణపై అవగాహన

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్-1 ఆధ్వర్యంలో "మత్తు పదార్థాల వినియోగ నివారణపై" మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.కాశీం హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాల ప్రభావం, యువతపై దాని దుష్ప్రభావాలు, బాధ్యతాయుతమైన ప్రవర్తన గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాల నిర్మూలనకు తోడ్పాటు అందించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈ.విద్యాసాగర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ 2047లో ఏవిధంగా యువత పాటుపడాలో వివరించారు. ఎస్ఎల్‌సీఏ రాష్ట్ర సమన్వయకర్త సుధాకర్ శ్రీపాద, నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ రెడక్షన్, డీ-అడిక్షన్ కౌన్సిల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎన్‌హాన్స్‌మెంట్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ రాథోడ్ గోవింద్ సింగ్ నాయక్, ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండ నాగేశ్వర రావు ముఖ్య వక్తలుగా హాజరై విద్యార్థులకు మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన కల్పించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

● జిల్లా సైన్స్ అధికారి ధర్మేంద్రరావు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సైన్స్ అధికారి ధర్మేంద్రరావు అన్నారు. తిరుమలగిరిలోని హోలీ ఫ్యామిలీ హైస్కూల్‌లో తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సీనియర్ సోషల్ సైంటిస్ట్ డాక్టర్ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో నేషనల్ స్టూడెంట్ పర్యావరణ కాంపిటీషన్ (ఎన్ఎస్‌పీసీ- 2025) పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మేంద్రరావు మాట్లాడుతూ.. కాలుష్యాన్ని నివారించి, పాఠశాలల్లో పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓలు బాలునాయక్, శ్రవణ్‌కుమార్, డీఐఎస్ వీరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా కొనసాగించాలి

ముషీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ పరిధిలోని జెమినీ కాలనీ, శాస్త్రీనగర్, ఉదయ్‌నగర్‌లో గతంలో తాగునీటిని సరఫరా చేసిన మాదిరిగానే చేయాలని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లాకార్యదర్శి తమగొండ రాజ్‌దీప్, సీనియర్ నాయకులు రామేష్ గౌడ్ జలమండలి అధికారులను కోరారు. మంగళవారం జలమండలి డీజీఎం మోహన్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతంలో సాయంత్రం 5గంటలకు మంచి నీటి సరఫరా చేసేవారని ఆ సమయాన్ని మార్చి గత కొన్నిరోజులుగా రాత్రి 7గంటలకు నీటిని వదులుతున్నారని ఫిర్యాదు చేశారు. తద్వారా మహిళలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నీటి సరఫరాను సాయంత్రం 5గంటలకు చేయాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ భవన్‌కు తరలిన నేతలు

మల్కాజిగిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై మాజీ మంత్రి హరీష్ రావు ఆధ్వర్యంలో మంగళవారం మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం గండిమైసమ్మలో నిర్వహించిన పవన్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి ఆధ్వర్యంలో భారీగా బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు కదిలివెళ్లారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబీపూర్‌రాజు, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డిలతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులతో కలిసి మర్రి రాజశేఖర్‌రెడ్డి, తదితరులు వీక్షించారు.

'మత స్వేచ్ఛ స్వప్నమా...సత్యమా'పై జాతీయ సదస్సు

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మతమార్పిడి చేస్తున్నారన్న ఆరోపణలతో క్రైస్తవులపై దాడులు చేస్తున్నారని సివిల్ రైట్స్ ఇనిషియేటివ్ ఇంటర్నేషనల్ జాతీయ అధ్యక్షుడు, మాజీ అదనపు డీజీపీ(మధ్యప్రదేశ్) బాబురావు ఆవేదన వ్యక్తం చేశారు. 9వ తేదీన సికింద్రాబాద్, క్లాక్‌టవర్ వద్ద గల సెంటినరీ బాప్టిస్టు చర్చ్‌లో నిర్వహించే భారతదేశంలో మత స్వేచ్ఛ స్వప్నమా..సత్యమా..అనే అంశంపై నిర్వహించే జాతీయ సదస్సు వివరాలను విలేకరుల సమావేశం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా క్రైస్తవులపై జరుగుతున్న అణచివేత, హింసాత్మక దాడులు, మత స్వేచ్ఛపై పెరుగుతున్న ఆంక్షల నేపథ్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పన్నెండు రాష్ట్రాల్లో మత నిరోధక బిల్ తెచ్చి వేధిస్తున్నారని మండిపడ్డారు. దళిత క్రైస్తవులను క్రిస్టియన్‌లోకి మారకుండా, మారిన వారిని తిరిగి వచ్చేలా ఘర్‌వాపసీ వంటి ఉద్యమాల ద్వారా బలవంతపు మత మార్పిళ్లు జరుగుతున్నాయని అన్నారు. ఈ సదస్సుకు రాజ్యాంగ విలువలను నమ్మే ప్రతి పౌరుడు హాజరు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జాతీయసదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఆర్ఐఐ జాయింట్ సెక్రటరి సురేష్, విద్యాస్రవంతి, ఫిరోజ్‌షా, అరుణ్‌జ్యోతి, లియో, సంజీవ్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సివిల్ రైట్స్ ఇనిషియేటివ్ ఇంటర్నేషనల్ సభ్యులు


ఆలుగడ్డబావిలో మల్టీటోన్ సైరన్లను సీజ్ చేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు. చిత్రంలో డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్

బౌద్ధనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధి ఆలుగడ్డబావి వద్ద ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. వాహనాలను ఆపి హారన్లు, సైరన్లులను తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో అమర్చిన మూడు మల్టీటోన్ సైరన్లను సీజ్ చేశారు. అలాగే పలువురికి డ్రంకెన్ డ్రైవ్ టెస్టులను నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసి ద్విచక్ర వాహనాన్ని, నాలుగు చక్రాల వాహనాన్ని సీజ్ చేశారు. మైనర్లు నడుపుతున్న రెండు వాహనాలను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు షేక్ బషీర్ అహ్మద్, వై.లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి తదితరులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి

బౌద్ధనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బీసీలపై కపట ప్రేమ చూపిస్తున్న రేవంత్ సర్కార్ పదిశాతం రిజర్వేషన్లు ముస్లింలకు కట్టబెట్టడానికి కుట్ర చేస్తుందని బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ఆరోపించారు. మంగళవారం మధురానగర్‌కాలనీ బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీలపై ప్రేమ ఉంటే కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించిన విధంగా 42శాతం బీసీలకే రిజర్వేషన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జనాభా దామాసా ప్రకారం రాష్ట్ర మంత్రి వర్గంలో బీసీలకు రావాల్సిన మంత్రి పదవులు కూడా ఓసీలకిచ్చి సీఎం నిజస్వరూపాన్ని చాటుకున్నాడని, ఇప్పటికైనా తప్పులు తెలుసుకుని పెండింగ్‌లో ఉన్న మంత్రి పదవులను బీసీలకు ఇవ్వాలన్నారు. సంవత్సరానికి బీసీలకు రూ.20వేల కోట్లు చొప్పున ఐదు సంవత్సరాల్లో లక్ష కోట్లు కేటాయించాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీలకు కేటాయించాలని, అందులో ముస్లింలను చేర్చమని సీఎం బహిరంగంగా ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కన్నాభిరామ్, ప్రకాశ్‌గౌడ్, అంబాల రాజేశ్వరరావు, వర్మ, హనుమంత్, ప్రతాప్‌కుమార్, దేవుడు కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ రన్నరప్ అనన్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఏఐటీఏ జాతీయ టెన్నిస్ టోర్నమెంట్ మహిళల డబుల్స్‌లో వారణాసి సాయి అనన్య జోడీ రన్నరప్‌గా నిలిచింది. జలంధర్‌లో జరిగిన ఈ పోటీల్లో అనన్య-ఆనందిత ఉపాధ్యాయ్ (హరియాణా)జోడీ 2-6, 4-6తో ఆకృతి నారాయణ-రిధి షిండే (మహారాష్ట్ర) జంట చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది.


అనన్య

రోడ్డుకు మరమ్మతు చేయండి

అడ్డగుట్ట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్ట డివిజన్ సాయినగర్‌లోని కేజీ ఆస్పత్రి వద్ద ఇంటి నంబరు 10-5-634 రోడ్డులో కొన్ని నెలలుగా రోడ్డు కుంగిపోవడంతో స్థానికులు భయానికి గురవుతున్నారు. రెండు రోజుల క్రితం ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి కుంగిపోయిన రోడ్డులో వర్షం నీరు రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వెంటనే ఈ రోడ్డుకు మరమత్తులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


సాయినగర్‌లో కుంగిపోయిన రోడ్డు

మర్యాదపూర్వక కలయిక

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను మంగళవారం బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాగీరు ఆనంద్‌బాబు కలిశారు. మార్కెట్ అభివృద్ధికి తాము చేపడుతున్న చర్యలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం గురించి ఆయనకు వివరించారు.

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి



శ్రీదేవి పోచమ్మకు గాజులతో అలంకరణ

సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని శ్రీదేవి పోచమ్మ దేవాలయంలో శ్రావణ మాస రెండో మంగళవారాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని, మూల మూర్తిని గాజులతో సుందరంగా అలంకరించారు.

- రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి

